పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటు చేయాలి

- ఓదెల సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం
- చివరి సమావేశంలో ఎంపీపీకి సన్మానం



ఎంపీపీ రేణుకదేవిని సన్మానిస్తున్న ఎంపీటీసీలు

ఓదెల: ప్రయాణికుల సౌకర్యార్థం పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం జరిగిన ఓదెల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించారు. జిల్లా కేంద్రానికి చుట్టూ అన్ని గ్రామాలకు తారురోడ్ల సౌకర్యార్థం ఉందని, వెంటనే డిపో ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సులు నడిపించాలన్నారు. గోపరపల్లె ఎంపీటీసీ గోవు లావణ్య మాట్లాడుతూ పాతకాలపు విద్యుత్ స్తంభాలను తొలగించి నాణ్యమైన వాటిని ఏర్పాటు చేయాలఽ కోరారు. కొలనూర్ ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్ మాట్లాడుతూ ఐకేపీ ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో కటింగు దందా నడిచిందని ఆరోపించారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అరికట్టాలని సూచించారు. స్పందించిన ఎంపీవో భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నామని, కార్యదర్శులతో ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల సాయంతో చెత్తచెదారం తొలగిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ స్రవంతి మాట్లాడుతూ మండలంలో మిషన్ భగీరథ పైపు లైన్ల ద్వారా ఇంటింటా సహాయక చర్యలు చేపడతున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో తిరుపతి, తహసీల్దార్ యాకయ్య, డాక్టర్లు మౌనిక, షాబోద్దీన్, సంజనేష్, ఏఈఈలు మోహన్‌నాయక్, రాజమల్లయ్య, సమ్మిరెడ్డి, ఎంపీటీసీలు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ, ఎంపీడీవోకు సన్మానం

ఎంపీపీ కునారపు రేణుకదేవి, ఎంపీడీవోగా పనిచేసి బదిలీ అయిన సత్తయ్యను ఎంపీటీసీలు, అధికారులు సన్మానించారు. అనంతరం ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు.

మీకోసమే వస్తున్నా.. ప్రతీ వార్డు సందర్శిస్తా



పెద్దపల్లిరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రతీ వార్డును సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్న ఆలోచనతోనే వార్డు సందర్శన చేపట్టానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని 19, 34వ వార్డుల్లో శుక్రవారం మున్సిపల్, ప్రభుత్వ అధికారులతో కలిసి పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. పట్టణ ప్రజలకు కనీస వసతులు కల్పించడంతో పాటు పట్టణాన్ని జిల్లా కేంద్రం హోదాకు తగ్గట్టు అభివృద్ధి చేస్తామన్నారు. రూ.52కోట్ల నిధులతో చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

రూ.11కోట్లతో అభివృద్ధి పనులు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో రూ.11కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని శ్రీరాంపూర్ రోడ్డు నుంచి గట్టెపల్లి రోడ్డు వరకు డబుల్ రోడ్డు పనులు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్ల వెడల్పునకు అందరూ సహకరించాలని కోరారు. పార్టీలకతీతంగా అందరితో ముందుకు వెళ్తామని, సమన్వయంతో ముందుకు వెళ్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. తైబజార్ విషయంలో లోకల్ వాహనాలకు ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వడానికి కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్మన్ బిరుదు సమత, కమిషనర్ వేణుమాధవ్, టీపీవో తిరుపతమ్మ ఏఈ శంకరయ్య, కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, జ్ఞానేశ్వరి, కూకట్ల గోపి, రాజయ్య, చింతల సునీత, తిరుపతి, గొట్టం లక్ష్మి, హనుమాల అరుణ, ఉట్ల వరప్రదీప్, రాధ, మున్సిపల్ మేనేజర్ అలీమోద్దీన్ ఉన్నారు.

పెద్దెల్లి ప్రకాశ్ కుటుంబానికి పరామర్శ



నివాళి అర్పిస్తున్న వివేక్ వెంకటస్వామి

గోదావరిఖనిటౌన్: టీపీసీసీ కార్యదర్శి పెద్దెల్లి ప్రకాశ్ తల్లి మధురమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శుక్రవారం దశదిన కర్మ కావడంతో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మంత్రి దొక్కా మాణిక్య వరప్రసాద్, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ పెద్దెల్లి ప్రకాశ్ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. మధురమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

సహజ వనరులు సింగరేణికే కేటాయించాలి

గోదావరిఖని: రాష్ట్రంలోని సహజ వనరులు సింగరేణికే కేటాయించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. సింగరేణి బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించి సంస్థ భవిష్యత్ పెంచాలని కోరారు. 'మన బొగ్గు మన హక్కు' అని నినదించి రాష్ట్రం కోసం కొట్లాడిన కార్మికుల నోట్లో మట్టికొట్టి సింగరేణికి భవిష్యత్ లేకుండా చేసేలా ప్రయివేట్ కంపెనీలకు బ్లాకులను కట్టబెట్టారని ఆరోపించారు. బొగ్గు బ్లాకులను సింగరేణికే ఇవ్వాలని ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు చేస్తోందన్నారు.

మహిళలతో మర్యాదగా ఉండాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

గోదావరిఖని: ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో ఈవ్‌టీజర్లకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రామగుండం కమిషనరేట్ మీటింగ్ హాల్‌లో ఇటీవల పోలీసులకు పట్టుబడిన ఈ వ్‌టీజర్లకు జూమ్ మీటింగ్ ద్వారా కౌన్సెలింగ్ చేశారు. మహిళలు, విద్యార్థినులతో బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం 24గంటలపాటు షీటీమ్‌లు మహిళా నేస్తంగా పనిచేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే మూడు నెలల్లో వేధింపులకు గురిచేసిన ఈవ్‌టీజర్స్ (ఆకతాయిలు) పట్టుకుని 42మందికి హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు చెందిన నిపుణులతో అవగాహన కల్పించారు. మహిళలను గౌరవించడం, వారితో ప్రవర్తించడం, అసభ్యంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం పడే శిక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్‌బీ సీఐ బుద్దె స్వామి, శ్రీరాంపూర్ మహిళా పోలీసు స్టేషన్ సీఐ రాజమౌళిగౌడ్, పెద్దపల్లి షీటీమ్ ఎస్సై రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శేష జీవితం ఆనందంగా గడపాలి



సన్మానిస్తున్న జీఎంలు సుధాకర్, వెంకటేశ్వర్లు

రామగిరి: సింగరేణి సంస్థలో ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. సివిల్ డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న పద్మరాజు 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. కాగా శుక్రవారం జీఎం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి పద్మరాజు దంపతులను సన్మానించారు. ఫైనాన్స్ ఏజీఎం పీ.శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎం జీ.రఘుపతి, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాదాకృష్ణ, కె.రాజేందర్, ఏరియా సేఫ్టీ అధికారి సీ.హెచ్.వెంకటరమణ, ఏరియా ఇంజనీర్ వై.శేఖర్ బాబు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి లతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నూతన కలర్ ప్రింటర్ ప్రారంభం

ఆర్జీ-3 ఏరియా జీఎం కార్యాలయంలోని సర్వే విభాగంలో నూతన కలర్ ప్రింటర్‌ను శుక్రవారం ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్ రావు ప్రారంభించారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం పీ.శ్రీనివాసులు, ఏరియా సర్వే అధికారి డి.జనార్దన్‌రెడ్డి, సివిల్ డీజీఎం పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



మాట్లాడుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి: ఆర్జీ-3 డివిజన్ ఏపీఏ ఏరియా పరిధిలోని గైర్హాజరు కార్మికులకు శుక్రవారం సెంటినరీకాలనీ సీఎస్‌సీవోఏ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 180 మంది ఉద్యోగులకు గాను 120 మంది ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విధులకు సరిగా హాజరు కాకపోతే ఉద్యోగి కుటుంబం ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సంస్థ కూడా నష్టపోతుందన్నారు. ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారులను కలిసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో విధులకు హాజరై కుటుంబ పోషణను నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ పద్మ, డీవైపీఎం హరీశ్, సీనియర్ పీవోలు మతిన్ హుస్సేన్, ఎల్.రవిచంద్ర పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ గురుకులాలకు టెండర్లు ఖరారు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఖరారు చేశామని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ టెండర్లను ఓపెన్ చేశారు. గురుకులాలకు నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, చికెన్, పండ్లు, కూరగాయల సరఫరాకు సంబంధించిన టెండర్‌దారుల సమక్షంలో ఓపెన్ చేసి ఖరారు చేశామని పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ జెజె థెరిస్సాతో పాటు ప్రిన్సిపాల్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రశంసాపత్రం అందిస్తున్న డీఈవో మాధవి

జ్యోతినగర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్(ఎన్జీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కాలుష్యం నివారణకు ప్రతీ విద్యార్థి తన ఇంటి ఆవరణలు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. నేషనల్ గ్రీన్ కోర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే అంశాలపై కవితలు రాయడం, పోస్టర్ తయారు చేయడంతో విద్యార్థుల్లో అవగాహన ఏర్పడి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు జయరాజు, జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కోఆర్డినేటర్ గూళ్ల అంజన్ కుమార్, గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్ మేకింగ్ డ్రాయింగ్‌లో కె.అక్షిత(ప్రథమ), హర్షిత(ద్వితీయ), వైష్ణవి(తృతీయ), కన్సోలేషన్‌గా ఎండీ అయేషా, కవితలు రాయడంలో సాయి వర్షిత(ప్రథమ), పూజ(ద్వితీయ), సహస్ర(తృతీయ) నిలవగా అతిథులు ప్రశంసపత్రాలు అందించారు.

జీజీహెచ్ డాక్టర్ల నిరసన

కోల్‌సిటీ: నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో పని చేస్తున్న డాక్టర్లపై ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టేలా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను నిరసిస్తూ, గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రిలో శుక్రవారం తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ) ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పలు విభాగాల హెచ్‌వోడీలు, నర్సింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఫరీద్ మహ్మద్, ప్రధాన కార్యదర్శి రవివర్మ, కోశాధికారి శిరీష మాట్లాడుతూ నల్గొండ ఆస్పత్రి చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి సన్మానం



సన్మానిస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

రామగుండం: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించారు. జూలై 4తో పదవీకాలం పూర్తవుతున్న క్రమంలో చివరి సమావేశం కావడంతో అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణను జెడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధుకర్ సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: పీజీ సెంటర్, గౌతమి నగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఏరియాల్లో మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గోదావరిఖని ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

30న రైతుకూలీ సంఘం సమావేశం

గోదావరిఖని: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 30న జరిగే అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని న్యూ డెమొక్రసీ(సీపీఐ- ఎంఎల్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కట్టా విశ్వనాథ్ కోరారు. శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతువ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. ఉపాధిహామీ పథకాన్ని నీరుగారుస్తూ, దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ గుత్త సంస్థలకు అప్పజెప్పడానికి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, కనీస మద్దతు ధరల చట్టాన్ని అటకెక్కించారని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి, రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదని, కార్పొరేట్ సంస్థలకు, మిలినీరులకు రూ.లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యమ ప్రస్థానంలో చేసిన పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు జూన్ 30 ఎఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. సమావేశంలో పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి దాముక లచ్చన్న, నాయకులు టి.రమేశ్, రాము, ముత్తయ్య, వెంకటేశ్, రాంచందర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలి

గోదావరిఖని: రామగుండం మండలం మల్కాపూర్ చివరకు సంబంధించి సర్వేనెంబర్ 83లో గల సింగరేణికి సంబంధించిన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య ఆర్జీ-1 జీఎంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సింగరేణి స్థలం సాయిలీలబార్ అండ్ రెస్టారెంట్‌కు ఆనుకొని ఉండడంతో ఆ స్థలం కనబడకుండా చుట్టూ చెట్లు నాటి సాయిలీల హోటల్ యజమాని పార్కింగ్ స్థలంగా వాడుకుంటూ ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్థలాన్ని కాపాడడానికి సింగరేణి వెంటనే స్పందించి ఆ స్థలం చుట్టూ గోడ నిర్మాణం చేపట్టి, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, ప్రశాంత్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. నాయకులు సురేశ్, రోషన్ ఉన్నారు.

డిస్పెన్సరీ భవనం గ్రంథాలయానికి కేటాయించాలి

గోదావరిఖనిటౌన్: స్థానిక పవర్‌హౌజ్ కాలనీలోని డిస్పెన్సరీ భవనంలో కొనసాగుతున్న ఎన్విరాన్మెంట్ టెస్టింగ్ ల్యాబ్‌ను వేరే చోటికి తరలించి శాశ్వతంగా గ్రంథాలయానికి కేటాయించాలని గ్రంథాలయ పాఠకులు, గ్రూప్స్ అభ్యర్థులు మధు కలెక్టర్ కోయ శ్రీహర్షకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

ధర్మారం ఎస్సైగా లక్ష్మణ్

ధర్మారం: ధర్మారం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా లక్ష్మణ్‌ను నియమిస్తూ డీఐజీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. ధర్మారం ఎస్సైగా పనిచేస్తున్న సత్యానారాయణను రామగుండం కమిషనరేట్ వీఆర్‌కు బదిలీ చేయగా మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న లక్ష్మణ్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

ఆ పాఠశాలలపై చర్య తీసుకోండి

మంథని: మంథనిలోని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధగా వ్యవహరిస్తునాయని, వాటి అనుమతి రద్దు చేయాలని ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షుడు కెక్కర్ల సందీప్, మండల అధ్యక్షుడు మంథని సురేశ్, నాయకులు టి.రాజు, శీలం ఈశ్వర్‌రెడ్డి శుక్రవారం మండల విద్యాధికారి దాసరి లక్ష్మికి వినతిపత్రం అందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామగుండం మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ అడప సోమేశ్ అన్నారు. 19వ, 17వ డివిజన్ ఏరియాల్లో శుక్రవారం పారిశుధ్య సిబ్బందితో కలిసి ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.

వేతనాలు మంజూరు చేయండి

మంథని: మంథని సామాజిక వైద్యశాల, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ కదారి సునీల్ డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పేషెంట్ కేర్, శానిటరీ, సెక్యూరిటీ, కాంట్రాక్టు కార్మికులకు ఐదునెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాగా దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించినట్లు సునీల్ తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి

ఎలిగేడు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛ శుక్రవారం నిర్వహించారు.

పెన్షన్ల పెంపుపై ఊసెత్తని ప్రభుత్వం

రామగుండం: పెన్షన్లు పెంచుతామని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ అమలు చేయడం లేదని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు కుక్క గంగాప్రసాద్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

మాజీ ప్రధాని పీవీ జయంతి

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/రామగిరి/ముత్తారం/యైటింక్లయిన్‌కాలనీ/కమాన్‌పూర్: భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఏఈవోకు సన్మానం

ఎలిగేడు: మండల ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న మంజూరు హుస్సేన్ ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భంగా మండల కేంద్రంలోని రైతువేదికలో ఉద్యోగ విరమణ సన్మానం నిర్వహించారు.

మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న జేసీ అరుణశ్రీ

ముత్తారం: మండలంలోని ధర్యపూర్ గ్రామాన్ని శుక్రవారం జేసీ అరుణశ్రీ సందర్శించారు. ధర్యపూర్‌లోని మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వనమహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. మోడల్ స్కూల్‌లో వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి జేసీ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా బోర్ వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఎంపీవో వేణుమాధవ్, పీఆర్ ఏఈ వరలక్ష్మి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులుగా తయారుచేసే బాధ్యత పీడీలదే



సన్మానిస్తున్న హెచ్‌ఎం రత్నాకర్‌రెడ్డి

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మందిని క్రీడాకారులుగా తయారు చేసే బాధ్యత పీడీలుగా పదోన్నతి పొందిన వారిపై ఉందని హెచ్‌ఎం రత్నాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ రమేశ్ అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం పీఈటీల నుంచి పీడీలుగా పదోన్నతి పొందిన వారిని ఘనంగా సన్మానించారు. సుల్తానాబాద్ బాలుర హైస్కూల్‌కు పీడీగా శ్రీవాణి, గర్రెపల్లికి జోహసియా బేగం, గట్టెపల్లికి ప్రణయ్, బాలికల పాఠశాలకు వెంకటేశ్ పదోన్నతిపై ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, సత్యనారాయణ ఉన్నారు.

పన్నూర్ తైబజారు వేలం

రామగిరి: మండలంలోని పన్నూర్ పరిధిలోని తైబజారు వేలం శుక్రవారం ప్రత్యేకాధికారి రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రసాద్‌గౌడ్ రూ.3.40లక్షలకు దక్కించుకున్నారు. డీఎల్‌పీవో శంకర్, ఎంపీటీసీ చిందం మహేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వార్డుల్లో స్వచ్ఛ శుక్రవారం



నీటిని పారబోయిస్తున్న చైర్‌పర్సన్ రమ, కమిషనర్ మల్లికార్జున్

మంథని: మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో స్వచ్ఛ శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, కూరగాయల మార్కెట్‌తో పాటు పలు వార్డులను మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్‌తో కలిసి చైర్‌పర్సన్ పరిశీలించారు. జన సంచార ప్రాంతాలు, నీటి నిల్వ ఉన్న పరిసరాల్లో నీటిని తొలగించారు. కుండీలు, డ్రమ్ములు, టైర్లు వంటి వాటిలో నీటి నిల్వలను వారానికి ఒకసారి కచ్చితంగా తొలగించుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్లు గుండ విజయలక్ష్మి, వేముల లక్ష్మి ఉన్నారు.

నీటి నిల్వ లేకుండా చూడండి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్: ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా శుక్రవారం పలు కాలనీలు సందర్శించారు. డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని వేడి చేసి చల్లారిన తర్వాతే తాగాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత పాల్గొన్నారు.

ఎంపీడీవో ఆకస్మిక పర్యటన

రామగుండం: మండల పరిధిలోని రాయదండి, ఎల్లంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో ఎంఏ.అలీం ఆకస్మికంగా పర్యటించారు. ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు తొలగించాలని, కుండలు, కూలర్లు, కొబ్బరి చిప్పలు, రోలు వంటి వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై పలు సూచనలు, సలహాలిచ్చారు.

విత్తనశుద్ధిపై అవగాహన

పెద్దపల్లిరూరల్: పంటలను సాగు చేసే రైతులు నాణ్యమైన విత్తనాలనే ఎంచుకోవాలని మండల వ్యవసాయాధికారి అలివేణి సూచించారు. నాణ్యమైన మేలురకం విత్తనాలను వినియోగించడంతో మంచి దిగుబడులు వస్తాయన్నారు. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలో శుక్రవారం విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో శిరీష, రైతులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు

జూలపల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పద్మజ సూచించారు. మండలంలోని అబ్బాపూర్‌లో స్వచ్ఛ శుక్రవారం సందర్భంగా గ్రామంలో పర్యటించి ఇంటి యజమానులకు పలు సూచనలు చేశారు.

మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామం నుంచి లింగాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం శుక్రవారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. కాంగ్రెస్ 14వ డివిజన్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం లేక విద్యార్థుల ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాసింగ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు, ఆర్టీసీ డిపో మేనేజర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఓలపు సుజాత రామ్మూర్తి, దేశెట్టి శైలేందర్, చితకారి చంద్రశేఖర్ లావణ్య, కనకరాజు, పూజిత, విద్యార్థులు ఉన్నారు.

పెండింగ్ రేషన్‌కార్డులు వెంటనే ఇవ్వాలి

కోల్‌సిటీ: పెండింగ్ రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖని చౌరస్తాలో శుక్రవారం న్యూఇండియా పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 15 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు లేవని, వారంతా ప్రభుత్వ పథకాలకు నోచుకోకుండా దూరంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో న్యూఇండియా పార్టీ నాయకులు జేవీ.రాజు, వేముల అశోక్, జనగామ లక్ష్మీనారాయణ, ములుగు వెంకటేశ్వర్లు, విక్రమ్‌సింగ్, జనగామ తిరుపతి, గంట బబిత, హేమా ప్రియదర్శిని, ఉమ పాల్గొన్నారు.